

లోకాయుక్త వలలో సర్వేయర్

చింతామణి, ఏప్రిల్ 4: ఒక వ్యక్తినుంచి లంచం తీసుకుంటుండగా సర్వేయర్ వసంతకుమార్ లోకాయుక్త పోలీసులకు పట్టుబడ్డాడు. చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి తాలూకాలోని కెంచార్లహళ్ళి గ్రామం వద్ద చిక్కబళ్ళాపుర లోకాయుక్త డీఎస్పీ వీరేంద్ర కుమార్ నేతృత్వంలో గురువారం ఉదయం అకస్మిక దాడులు నిర్వహించారు. తాలూకాలోని మోటమాకహళ్ళి గ్రామం సర్వే 161/2లో 1 ఎకరా 20 గంటలకు హిస్సాపోడి చేయడం కోసం భూ యజమాని హరీశ్‌బాబు నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వసంతకుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



హాసన్‌లో... ప్రజ్వల్ రేవణ్ణ నామినేషన్లో పాల్గొన్న మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు గ్రామీణ బీజేపీ అభ్యర్థి డాక్టర్ మంజునాథ్



నామినేషన్ వేస్తున్న కన్నడ చళువళి పోరాట నేత వాటాళ్ నాగరాజ్

నామినేషన్ల పర్వానికి తెర



● తొలివిడతకు చివరి రోజు పోటాపోటీగా 183 మంది దాఖలు ● మండ్య నుంచి కుమారస్వామి, హాసన్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ ● నేతల పూజలతో ఆలయాలు కిటకిట ● జోరందుకున్న ప్రచారాలు

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కీలకమైన తొలివిడత నామినేషన్ల ఘట్టం గురువారం ముగిసింది. చివరి రోజు కావడంతో అన్ని ప్రముఖ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. తమ నియోజకవర్గాల పరిధిలో ర్యాలీగా సాగి ఎన్నికల అధికారులకు అందజేశారు. బెంగళూరు దక్షిణనుంచి బీజేపీ అభ్యర్థి తేజస్వి సూర్య తొలుత జయనగర 4వ బ్లాక్‌లోని వినాయక దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులతో కలసి ర్యాలీ నిర్వహించారు. తదుపరి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత ఆర్ అశోక్, బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, జేడీఎస్ నేత టీఏ శరవణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఓపెన్‌టాప్ వాహనంలో స్వయంగా తేజస్విసూర్య వాహనం నడపడం విశేషం.

● మండ్య జేడీఎస్-బీజేపీ మైత్రి అభ్యర్థిగా హెచ్‌డీ కుమారస్వామి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా గోవా సీఎం డాక్టర్ ప్రమోద్‌సావంత్, మాజీ సీఎం యడియూరప్ప, మైసూరు-కొడగు అభ్యర్థి యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయార్, మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజు, కేఆర్‌పేట ఎమ్మెల్యే హెచ్‌డీ మంజునాథ్, మాజీ మంత్రి సారా మహేశ్, నిఖిల్ కుమారస్వామి, మాజీ మంత్రి కేసీ నారాయణగౌడ, మాజీ ఎమ్మెల్యే సురేశ్‌గౌడ, అన్నదాని, రవీంద్ర శ్రీకంఠయ్య, జేడీఎస్ నాయకులు ఆర్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా హాసన్ జేడీఎస్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ కూడా ఉత్సాహంగా నామినేషన్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జేడీఎస్ నాయకులు మాజీ ప్రధాని దేవేగౌడ, హెచ్‌డీ రేవణ్ణ, భవాని తదితరులు పాల్గొన్నారు. దక్షిణకన్నడ జిల్లా బీజేపీ అభ్యర్థి కెప్టెన్ బ్రిజేశ్‌చౌట నామినేషన్‌లో బీజేపీ మాజీ అధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్, సతీశ్ కుంపల, ఎమ్మెల్యే భాగీరథి మురుళ్య, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు జాకే మాధవ గౌడ తదితరులు పాల్గొన్నారు.

● బెంగళూరు గ్రామీణ నుంచి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అశ్వత్థనారాయణ, బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప, మాజీ మంత్రి మునిరత్న పాల్గొన్నారు. తొలుత ఆయన రామనగరలోని చాముండేశ్వరి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. పీడబ్ల్యుడీ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీగా సాగారు. కాగా బెంగళూరు దక్షిణ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కన్నడచళువళి పోరాట నేతగా పేరొందిన వాటాళ్ నాగరాజ్ నామినేషన్ సమర్పించారు. ఎటువంటి సందడి లేకుండా గురువారం ఉదయం ఆటోలో వచ్చి జయనగర్ బీబీఎంపీ కార్యాలయంలో నామినేషన్ వేశారు.

చివరి రోజు 183మంది నామినేషన్

లోక్‌సభ ఎన్నికల్లో తొలి విడతలో భాగంగా 14 నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల చివరి రోజున 183మందికిగాను 224 సెట్ల నామినేషన్లు సమర్పించారు. అత్యధికంగా బెంగళూరు దక్షిణలో 35మంది నామినేషన్లు వేశారు. ఉడుపి-చిక్కమగళూరు 6, హాసన్ 11, దక్షిణకన్నడ 6, చిత్రదుర్గ 19, తుమకూరు 11, మండ్య 11, మైసూరు 14, చామరాజనగర 9, బెంగళూరు గ్రామీణ 15, బెంగళూరు ఉత్తర 14, బెంగళూరు సెంట్రల్ 15, బెంగళూరు దక్షిణ 35, చిక్కబళ్ళాపురలో 18మంది నామినేషన్లు వేశారు. వీరిలో పురుషులు 171మంది, మహిళలు 12మంది ఉన్నారు. కాగా మార్చి 28 నుంచి ఇంతవరకు 14 నియోజకవర్గాలకు పురుషులు 333మంది, మహిళలు 25 మొత్తం 358మందికి గాను 492 సెట్ల నామినేషన్లు సమర్పించారని ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. ఈసారి ఎన్నికల్లో థర్డ్ జెండర్‌లు ఎవరూ నామినేషన్ వేయక పోవడం గమనార్హం.



మండ్య జేడీఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కుమారస్వామి, మద్దతు పలుకుతున్న మాజీ సీఎం యడియూరప్ప

ఆపరేషన్ కమలకు రూ. వేలకోట్లు ఎక్కడివి..?

● ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం సూటి ప్రశ్న



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కమలకు వేలకోట్ల రూపాయలు ఎక్కడనుంచి వచ్చాయంటూ ప్రధాని నరేంద్రమోదీని సీఎం సిద్దరామయ్య సూటిగా ప్రశ్నించారు. గురువారం చిత్రదుర్గ లోక్‌సభ అభ్యర్థి చంద్రప్ప తరపున ఏర్పాటైన భారీ బహిరంగసభను ఉద్దేశించి మాట్లాడారు. విదేశాలనుంచి నల్లధనం వెనక్కి తెస్తామని, ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు బ్యాంకు అకౌంట్‌లో వేస్తామని హామీ ఇచ్చారు కదా... ఏమైందన్నారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాల హామీ ఎక్కడంటూ ప్రధాని మోదీని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, రసాయన ఎరువులు, వంటనూనె, ఇతర నిత్యావసరాల ధరలు అందుబాటులోకి ఉంచుతామన్న హామీ ఏమైందన్నారు. మీ హయాంలో కష్టాలెదుర్కొంటున్న ప్రజలకు ఊరటనిచ్చేలా ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నామని అన్నివర్గాల వారికి ప్రయోజనం అందుతోందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.4నుంచి 6వేల రూపాయల ప్రయోజనం దక్కుతోందని ఇది రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ సాధన అన్నారు.

● దేశంలో 95శాతం మెజారిటీ ప్రజలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం రాజ్యాంగబద్ధమన్నారు. ఈ విధానాన్ని మార్పు చేస్తామంటున్న బీజేపీ అజెండాను అర్థం చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని బీజేపీ కేంద్ర మంత్రి స్వయంగా బహిరంగంగా వెల్లడించారన్నారు. రాజ్యాంగాన్ని మార్పు చేసి మనుస్మృతిని తెచ్చేలా అవకాశం ఇవ్వరాదని ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి గోవింద కారజోళ స్థానికులు కారని కాంగ్రెస్ అభ్యర్థి స్థానికుడు కావడంతో నిత్యం ప్రజలమధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటారన్నారు.

బీజేపీ చేసిన ద్రోహాలు ఎన్నో

రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన ద్రోహాలు ఎన్నో అన్నారు. గతంలో వరదలు వచ్చినవేళ సక్రమంగా స్పందించలేదన్నారు. ఈసారి ఆశించిన మేర వర్షాలు కురవక కరువు నెలకొనగా కేంద్రబృందాలు పర్యటించినా నివేదికలు సమర్పించినా కనీస గ్రాంటు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర నీటి ప్రాజెక్టులకు కనీసం గ్రాంటుకేటాయించే అంశం కూడా బడ్జెట్‌లో ప్రస్తావించినా ఆచరణలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లను కోరడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇలా అన్ని విధాలా విఫలమైన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో మంత్రులు సతీశ్‌జార్కిహొళి, ఎమ్మెల్యే ఎన్‌వై గోపాలకృష్ణ, రఘుమూర్తి, వీరేంద్ర, పావగడ వెంకటేశ్, గోవిందప్ప, బసంతప్ప, చిత్రదుర్గ, దావణగెరె జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యే జిల్లా, తాలూకా బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు..!



● బోరుబావిలో పడ్డ బాలుడి కథ సుఖాంతం ● ఫలించిన 20 గంటల నిరంతర శ్రమ..



సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 4: బోరుబావిలో పడ్డ బాలుడు సురక్షితంగా బయటపడి మృత్యుంజయుడిగా నిలిచాడు. విజయపుర జిల్లా పరిధిలోని ఇండి తాలూకా, లచ్యాణ గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బోరు బావిలో పడిన బాలుడిని గ్రామస్థులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సమష్టిగా కాపాడారు. విజయపుర జిల్లా యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న బుధవారం సాయంత్రం నుంచి చేపట్టిన కార్యాచరణ గురువారం మధ్యాహ్నానికి ముగిసింది.

ప్రమాదం జరిగింది ఇలా..

విజయపుర జిల్లా పరిధిలోని ఇండి గ్రామానికి చెందిన రైతు శంకరప్ప రెండు రోజుల క్రితం పొలంలో బోరుబావిని తవ్వించారు. బోరులో నీళ్ళు పడక పోవడంతో తవ్విన బోరు బావిని మూయకుండా అలాగే వదిలివేశాడు. బుధవారం రైతు శంకరప్ప మనవడు 14 నెలల సాత్విక్ ఆడుకుంటూ పొలంలో తెరచి ఉంచిన బోరుబావిలో పడిపోయాడు. గమనించిన కుటుం బ సభ్యులు గమనించి వెంటనే స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై బుధవారం సాయంత్రం నుంచి సహాయక చర్యలు ప్రారంభించారు. కళ్లెదుటే కన్నకొడుకు బోరుబావిలో చిక్కుకోవడంతో కన్నతల్లిదండ్రుల ఆక్రందనలు మిన్నంటాయి. ఘటనా స్థలానికి పెద్ద ఎత్తున చేరుకున్న గ్రామస్థులు చిన్నారి సాత్విక్ ప్రాణాలతో రావాలని దేవాలయాల్లో పూజలు జరిపారు.

రెస్క్యూ ఆపరేషన్ జరిగింది ఇలా..

బుధవారం సాయంత్రం బోరు బావిలో బాలుడు పడి పోగానే సహాయక చర్యలు ప్రారంభించారు. ఓవైపు చీకటి పడుతుండగా.... మరోవైపు గ్రామంలో మిన్నంటిన ఆక్రందనలు... మరోవైపు భారీగా తరలి వచ్చిన ప్రజలను ఆపలేక స్థానిక పోలీసులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఘటనా స్థలాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది.. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి స్వాధీనం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 20అడుగుల లోతులో చిన్నారి సాత్విక్ తలకిందులా ఇరుక్కున్నట్లు గుర్తించారు. బోరు బావిలో ఇరుక్కున్న చిన్నారికి కావలసిన ఆక్సిజన్ పంపుతూ... బోరు బావికి సమాంతరంగా మరో గుంతను తవ్వే ప్రయత్నం చేశారు. మధ్యలో పెద్ద పరిమాణంలో రాతిగుండు అడ్డురావడంతో కొంతమేర ఆటంకం ఏర్పడింది. అం ... నా నిరుత్సాహం చెందక బండను పగులగొట్టి... సుమారు 20గంటలకుపైగా శ్రమించి బోరుబావులో ఇరుకున్న సాత్విక్‌ను ప్రాణాలతో బయటకు తీయడంలో సఫలీకృతులయ్యారు. దీంతో ఆర్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది జిల్లా యంత్రాంగం అభినందనలు తెలిజేసింది. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నా ప్రజల్లో మాత్రం జాగృతి రాకపోవడం వలన తెరచిన బోరుబావులు చిన్నారుల పాలిట మృత్యుకూపాలుగా మారుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




బాలుడిని బయటకు తీసుకొస్తున్న రక్షణ సిబ్బంది..ఆస్పత్రిలో..

ఫలించిన పూజలు..

వేలాది మంది ప్రజల ప్రార్థనలు ఎట్టకేలకు ఫలించాయని చెప్పవచ్చు. సహాయక చర్యల్లో ప్రాణాలతో బతికి బయటపడిన సాత్విక్ ఘటన వైద్యలోకాన్ని ఆశ్చర్యపరుస్తోంది. రెండేళ్ళ చిన్నారి కొన్ని గంటల పాటు ఆహారం, నీరు, వెలుతురు లేని ఇరుకైన స్థలంలో కదలేని స్థితిలో ఉండి. ప్రాణాలతో బతికి బయట పడడం వైద్యులను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. సహాయక చర్యల్లో గొట్టపు బావి నుండి బయటకు తీసిన బాలుడిని ఇండి తాలూకా ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలుడి కి పల్స్ రేటుతో పాటు ఇతరత్రా పరీక్షలు చేశారు. బాలుడికి ఎలాంటి గాయాలు లేవని, బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు స్పష్టం చేశారు.

ఖర్గేపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు విషంవంటివని వాటివైపు చూడరాదంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఈమేరకు ఖర్గేపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ బృందం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్సీ ఛలవాది నారాయణస్వామి, బీజేపీ అధికార ప్రతినిధి ఎంజీ మహేశ్, పార్టీ లా సెల్ కన్వీనర్ వసంత్‌కుమార్, ప్రశాంత్ జీఎస్, జిల్లా ప్రతినిధి కాంతిశెట్టిల నేతృత్వంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఖర్గే తమ వ్యాఖ్యలతో బీజేపీని చులకన చేసేలా ఉన్నాయని, ఇవి ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని, కావున ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు బృందం తన ఫిర్యాదులో పేర్కొంది. కాగా యువ కాంగ్రెస్ మీడియా ప్యానెలిస్ట్ అక్షతా రవికుమార్ 'ఎక్స్' ఖాతాను ఫ్రీజ్ చేయాలని డిమాండ్ చేశారు.



నగరంలో చిరుత పిల్ల..



బస్సుకిందకు పరిగెడుతున్న చిరుతపిల్ల




చిరుతకు చికిత్స చేస్తున్న వైద్యులు

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో చిరుత పిల్ల కలకలం సృష్టించింది. కనకపుర రోడ్డు మార్గంలో కెంగేరి-బనశంకరి మధ్య నడిచే బీఎంటీసీ సిటీ బస్సు తురహళ్ళి అటవీప్రాంతం వద్ద రోడ్డుపై చిరుత పిల్ల ఉండడాన్ని డ్రైవర్ గుర్తించాడు. కొద్దిదూరంలోనే బస్సును ఆపారు. అదే సమయంలో రోడ్డును దాటుతున్న చిరుత పిల్లను ఓ కారు అకస్మాత్తుగా ఢీకొంది. కంగారుపడిన చిరుత ఒక్కసారిగా బస్సు కిందకు వచ్చి నక్కింది. ఎంతసేపటికైనా రాకపోవడంతో చనిపోయిందేమోనని అందరూ భావించారు. కొంతసేపటికి చిరుతపై నీళ్లు చల్లారు. సుమారు అరగంట గడిచినా చిరుత బస్సు కిందనుంచి రాలేదు. అప్పటికే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు చేరుకున్నారు. సుమారు 8 నెలల చిరుతకు ఎటువంటి గాయాలు లేవని గుర్తించారు. కారు ఢీ కొనడంతో బెదరిందని, ప్రజలను చూసి కంగారుపడి బస్సు కింద నక్కినట్లు గుర్తించారు. చిరుత ఆరోగ్యంగానే ఉందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం చిరుత అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉంది. బుధవారం చోటు చేసుకున్న ఘటన ప్రయాణీకులను బెంబేలెత్తించింది. మొత్తమ్మీద చిరుతను అక్కడనుంచి తరలించడంలో అటవీశాఖ అధికారులు సఫలీకృతులు కావడంతో ప్రయాణీకులు, ఇతర వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.



నేడు బీజేపీలో చేరనున్న సుమలత

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండ్య అభివృద్ధియే లక్ష్యంగా నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలని ఆకాంక్షిస్తూ బీజేపీకి మద్దతు ప్రకటించానని సుమలతా అంబరీశ్ వెల్లడించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 11గంటలకు బెంగళూరు బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకుల సమక్షంలో చేరుతానని గురువారం తెలిపారు. ఈమేరకు మండ్య అభిమానులు, అంబరీశ్ అభిమానులు, బీజేపీ అభిమానులు పాల్గొనాలని కోరారు. ఇటీవల ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించిన సుమలత, నాయకుల చర్చలతో మనస్సు మార్చుకున్నట్టు తెలుస్తోంది.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1580.16	1,582.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	868	6,027
సామర్థ్యం (టీఎంసీలు)	4.46	6.04



అధికారులతో చర్చిస్తున్న డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా అధికారి

సిరుగుప్ప, ఏప్రిల్ 4 : పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూలులో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఆ ప్రాంతాన్ని జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సందర్శించి, చుట్టుపక్కల ఆవరణాన్ని పరిశీలించారు. అభ్యర్థుల నామినేషన్ల అనంతరం ఈవీఎంలలో పేర్లను ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షంషాలం, ఆర్‌ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయరా... నాయకా..!

● జలాశయాల్లో పూడికతీతను పట్టించుకోని పాలకులు ● నిల్వ సామర్థ్యం తగ్గి.. నీరు వృథా

బళ్లారి సిటీ, ఏప్రిల్ 4: జలాశయాల సంరక్షణపై పాలకులు నిర్లక్ష్యం వీడడం లేదు. ఎన్నో ఏళ్లుగా కాల్వల్లో పూడిక తీసి నీటిని కాపాడుకోవాలని డిమాండ్ చేస్తున్నా పాలకుల్లో చలనం రావడం లేదు. జలాశయాల్లో ఏటేటా పూడిక నిండిపోయి నష్టపోతున్నా అన్నదాతను మేలు చేయాలన్న ఆలోచన వారిలో రావడం లేదు. జలాశయాల్లో ఏటేటా పూడిక నిండిపోతోంది. రాష్ట్రంలోని ఆల్మట్టి జలాశయంలో 123 టీఎంసీలు, తుంగభద్ర డ్యాంలో 101టీఎంసీలు, భద్రా డ్యాంలో 72టీఎంసీలు, కృష్ణరాజసాగర డ్యాంలో 48టీఎంసీలు, మలప్రభ డ్యాంలో 33 టీఎంసీలు, హేమావతి డ్యాంలో 37టీఎంసీలు, నారాయణపూర్ డ్యాంలో 33టీఎంసీలు, కబిని డ్యాంలో 20టీఎంసీలు, హారంగి డ్యాంలో 9టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు.

తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

డ్యాంలో చేరిన పూడిక వల్ల ఆయా జలాశయాల్లో నీటి నిల్వ ఏటేటా తగ్గిపోతోంది. రాష్ట్రంలోని ప్రధానంగా 9జలాశయాల్లో అన్నింటిలోనూ పూడిక చేరిపోవడం వల్ల ఏటేటా నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పూడిక చేరిపోవడంతో సాగునీటి తోపాటు తాగునీటి కష్టాలు కూడా మొదలయ్యాయి. వేసవి కాలం వచ్చిందంటే ఆయా జలాశయాలపై ఆధారపడిన గ్రామాలు, పట్టణాలు, నగరాలు తాగునీటి కోసం హాహాకారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. పాలకులకు ముందు చూపు లేకపోవడం ప్రజలకు శాపంగా మారుతోంది.

తుంగభద్ర డ్యాంలో భారీగా పూడిక

రాష్ట్రంలోని జలాశయాల్లో కంటే తుంగభద్ర డ్యాంలోకి అధిక పూడిక చేరింది. ఈ డ్యాం గరిష్ట నీటి నిల్వ 133టీఎంసీలు కాగా ప్రస్తుతం 101టీఎంసీలకు పడిపోయింది. దాదాపు 92టీఎంసీల వరకు పూడిక చేరిపోవడం వల్ల డ్యాంలో నీటి నిల్వ కూడా తగ్గిపోవడంతో పాటు అందాల్సిన నీరు ఆయా ప్రాంతాలకు అందడం లేదు. ఇక రాష్ట్రంలోని కేఆర్ఎస్ డ్యాంలో నీటివాటాలపై ఏటేటా సమస్యలే. అక్కడ తమిళనాడు, రైతుల ఆందోళనలు తెలియనివి కావు.



తుంగభద్ర డ్యాంలో అడుగంటిన నీరు

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

బారీ వర్షాలు వచ్చినప్పుడు డ్యాంలో నీటిని నిల్వ చేసుకునేందుకు పూడిక వల్ల సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడంపై పాలకులు దృష్టి సారించడం లేదు. ఏటా అర్థ టీఎంసీ పూడిక చేరుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా సమాంతర జలాశయం, సమాంతర కాలువ, పూడికతీత ఈ మూడింటిలో ఏదైనా ఒకటి తక్షణం అమలు చేసి, నీటిని నిల్వ చేసుకోకపోతే రాబోయే రోజుల్లో ఈ ప్రాంత వాసులు మరింత సమస్య ఎదుర్కోవలసి వస్తుందని జల నిపుణులు హెచ్చరిస్తున్నారు. పూడిక తీతపై ప్రజాప్రతినిధులు దృష్టిచారించాల్సిన అవసరం ఉంది.



జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభిస్తున్న గాలి లక్ష్మీఅరుణ

బీజేపీతోనే జిల్లా అభివృద్ధి: గాలి లక్ష్మీ అరుణ

బళ్లారి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని గాలి లక్ష్మీ అరుణ పిలుపునిచ్చారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన బీజేపీ కా ర్యకర్తల సమావేశంలో లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు, గాలి జనార్దన్ రెడ్డి సతీమణి లక్ష్మీ అరుణ, సండూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కేఎస్ దివాకర్, ఓఎంసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశాన్ని గాలి లక్ష్మీ అరుణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బళ్లారి, విజయనగరం జిల్లాలను గాలి జనార్దన్ రెడ్డి ఇన్‌చార్జి మంత్రిగా వున్న సమయంలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీజేపీని గెలిపించాలన్నారు. జిల్లాకు క్రికెట్ స్టేడియం, ఎయిర్‌పోర్టుకు నిధులు తీసుకు వచ్చి అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, ధరప్ప నాయక, కేఎస్ దివాకర్, గుర్రం వెంకటరమణ, ఓఎంసీ శ్రీనివాసరెడ్డి, కేఎస్ అశోక్, రమణమ్మ, కార్పొరేటర్లు తిలక్, హనుమంతు, బళ్లారి జేడీఎస్ జిల్లా అధ్యక్షులు మీనళ్లి తాయణ్ణ, దమ్మూరు శేఖర్, అసోండి సూరి, పాల్గొన్నారు.

నాగేంద్రపై ధ్వజం..

నాగేంద్ర.. జనార్దన్‌రెడ్డి నుంచి నీవు పైకి వచ్చిన వాడివి., ఆయన గురించి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు.. బీజేపీ నుంచి బయటకు వెళ్లిన నీవా బీజేపీ నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ నిప్పులు చెరిగారు. నీ రాజకీయ భవిష్యత్తు జనార్దన్‌రెడ్డి పెట్టిన భిక్షే, అది మరవ వద్దు అని ధ్వజమెత్తారు. మేము కేసులకు భయపడి బీజేపీలో చేరలేదన్నారు. తల్లిలాంటి పార్టీలోకి తిరిగి చేరినందుకు ఆనందంగా ఉందన్నారు. మీనహళ్లి తాయణ్ణ, మా జీ మేయర్ వెంకటరమణ, వెంట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి..

కంప్లి, ఏప్రిల్ 4: అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడాలని రైతులు డిమాండ్ చేశారు. కుడితిని పరిధిలోని హరిగిణదోణి, జానెకుంటి, కొలగల్లు, ఎర్రంగళి, సిద్దమ్మన హళ్లి, కుడితిని ఆరు గ్రామాల రైతులు సుమారుగా కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకున్నా న్యాయం జరగలేదని వాపోయారు. కుడితినిలో సుమారు 474 రోజులుగా నిరసనలు చేపడుతున్నా ప్రజాప్రతినిధులకు, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోయిందని సీఐటీయు జిల్లా అధ్యక్షులు సత్తిబాబు తెలిపారు. గురువారం రైతుల నిరసనలో ఆయన మాట్లాడుతూ ఎండ, వేడి, గాలి, వర్షాలకు బెదరకుండా రైతులు చేస్తున్న ఆందోళనను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతు శ్రేయస్సు గురించి మాట్లాడే నాయకులు చర్యలో మాత్రం శూన్యమన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే త్వరలోనే రైతు సంఘ నాయకులు, సంఘసంస్థ నేతలు ఒక నిర్ణయం తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు సత్తిబాబు



మాట్లాడుతున్న జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు

ఎన్నికల విధులపై శిక్షణ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎస్టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ టీం సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. హొసపేట తాలూకా పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సదాశివ ప్రభు మాట్లాడుతూ దేశంలో ఎన్నికలు అత్యంత ముఖ్యమైన, సున్నితమైన దశ అని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో వివిధ కార్యక్రమాల్లో నిమగ్నమైన సిబ్బంది ఎన్నికలను స్వేచ్ఛగా , నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడడమే ఎన్నికల సిబ్బంది ప్రాథమిక కర్తవ్యమని గ్రహించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల వీడియో రికార్డింగ్ సహా పలు అంశాలపై జిల్లా పంచాయతీ చీఫ్ అకౌంటెంట్ శ్రీనివాస, అకౌంటెంట్లు రియాజ్, దినేశ్ మాట్లాడారు. జిల్లాపంచాయతీ వినయ్‌కుమార్ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 4: వీవీ సంఘం కార్యనిర్వాహక ఎన్నికల కోసం వాలంటీర్ విద్యార్థులకు రావ్ బహదూర్ మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వీవీ సంఘం ఎన్నికల అధికారి లింగనగౌడ్ మాట్లాడుతూ మూడేళ్లకో సారి జరిగే ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వీరశైవ కళాశాల ఆర్‌వైఎంఈసీ సిబ్బంది విద్యార్థులు, వలంటీర్ల కృషి అభినందనీయమన్నారు. అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, సెక్రటరీ అరవింద్ పటేల్ విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా నూతన పదాధికారులు అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, ఉపాధ్యక్షులు జానెకుంట బసవరాజు, కార్యదర్శులు అరవింద్ పటేల్, అసోసియేషన్ కార్యదర్శులు మేటి పంపనగౌడ, కోశాధికారి భైలువద్దిగేరి ఎర్రిస్వామి, ఎన్నికల అధికారి లింగనగౌడను సత్కరించారు.



మాట్లాడుతున్న వీవీ సంఘం ఎన్నికల అధికారి లింగనగౌడ

వరి పొలంలో మొసలి ప్రత్యక్షం

● బెంబేలెత్తిన రైతులు

కంప్లి, ఏప్రిల్ 4 : వరిపొలంలో మొసలి ప్రత్యక్షం కావడంపై రైతులు బెంబేలెత్తారు. సిరిగేరి సమీపంలోని గుండిగనూరు గ్రామం దేవన్నగౌడ పొలంలో గురువారం ఉదయం వరి పొలంలో మొసలి ప్రత్యక్షమైంది. రైతు దేవన్నగౌడ తీవ్ర భయాందోళన చెందారు. యథావిధిగా పొలానికి రైతు కోతకు వచ్చిన వరి పంటను చూసేందుకు వెళ్లారు. రైతు వాగు పక్కలో నుండి వెళుతుండగా మొసలి పొలంలో కనిపించడంతో వెంటనే అటవీ అధికారులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న అధికారులు మొసలిని బంధించి నదిలో వదిలేశారు. రైతులు జాగ్రత్త వహించాలని అధికారులు హెచ్చరించారు.



వరి పొలంలో ప్రత్యక్షమైన మొసలి

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన

కంప్లి, ఏప్రిల్ 4 : గ్రామాల్లోని ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సండూరు తాలుకా పంచాయతీ ఈఓషడక్షరయ్య తెలిపారు. గురువారం తాలుకా పరిధిలోని దరోజీ గ్రామ పంచాయతీ హోస మాదాపురంలో ఉపాధి కూలీలతో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం చేపట్టి వారికి తమ అమూల్యమైన ఓటును ఎలాంటి ప్రలోభాలకు లోబడకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రమాణం చేయించారు. అలాగే విజయనగర జిల్లాలోని హువినఅడగళి తాలుకా నాగళ గ్రామంలో ఉపాధి కూలీలు డైరెక్టర్ డీ వీరన్న ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కంప్లి తాలుకా పంచాయతీ కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశమై ఏడీ మల్లన్నగౌడ ఓటు హక్కుపై జాతను ప్రారంభించారు. అలాగే కంప్లి పురసభలో అధికారులు తహసీల్దార్ శివరాజ్, తాలుకా ఈవో శ్రీకుమార్, ముఖ్య అధికారి రెడ్డి రాయన గౌడ సంతకాలతో ప్రభుత్వ అవగాహన కల్పించారు.



సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న తహసీల్దార్ శివరాజు

సిరుగుప్ప: ఓటు హక్కు వినియోగించడం ప్రజాప్రభుత్వ వ్యవస్థలో సామాన్యుల హక్కు అని తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం సిరుగుప్ప పట్టణం హైస్కూలు మైదానం నుంచి ప్రధాన రహదారిలో సైకిల్ జాత నిర్వహించారు. తాలుకా వ్యాప్తంగా వున్న ఓటర్లు మే 7వ తేదీన తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సైకిల్ జాత చేపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పచ్చ జెండా ఊపుతూ ఈ ర్యాలీకి అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో తాలుకాలో వుండే నగరసభ కమీషనర్ గురుప్రసాద్, అమరేశప్ప, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేడీఎస్, బీజేపీలో అసమ్మతి సెగ

పావగడ, ఏప్రిల్ 4: ఈనెల 26న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ పొత్తుతో పార్లమెంటు అభ్యర్థిగా గోవింద కారజోళ నామినేషన్ దాఖలు చేయడానికి చిత్రదుర్గం వచ్చిన సందర్భంగా నాయకులు, కార్యకర్తల మధ్య అసమ్మతి సెగ ఏర్పడింది. జిల్లా ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పను నియమించడంతో పావగడ నుండి 50 బస్సులు తరలివెళ్లడానికి అవకాశం కల్పించినా కేవలం 10 బస్సులలో మాత్రమే తరలివెళ్లారు. అంతేకాకుండా కార్లలో బయలు దేరడానికి వారికి కనీసం డీజల్, కార్యకర్తలకు భోజన సౌకర్యం కల్పించకోవడంతో తిమ్మరాయప్పపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సగం దావనుండే వెనుదిరిగి వచ్చే పరిస్థితి నెలకొందని బీజేపీ నాయకులు తీవ్రంగా మండి పడ్డారు. తిమ్మరాయప్పకు తప్ప వేరొక్కరికి ఇన్‌చార్జి బాధ్యత కట్టబెడితేనే బీజేపీ ఉనికి ఉంటుందని, లేదంటే రాష్ట్రంలో జేడీఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



బోగస్ కుల ధ్రువీకరణ వివాదంలో బీజేపీ అభ్యర్థి

● నామినేషన్ రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు



రాయచూరు బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల్లో రాయచూరు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్‌కు కుల వివాదం చుట్టుకుంది. ఆయన కుల ధ్రువీకరణ పత్రం నకిలీదంటూ దాన్ని రద్దు చేయాలని లింగసుగూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు అందింది. మాన్వి తాలూకా కరడిగుడ్డ గ్రామానికి చెందిన నరసింహలు నాయక్ అనే వ్యక్తి గురువారం రాజా అమరేశ్వర్ నాయక్ కుల ధ్రువీకరణ నకిలీదంటూ లింగసుగూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విద్యాభ్యాసం చేసేటప్పుడు ఉన్న ధ్రువపత్రాల ఆధారంగా ఆయన ఈ ఫిర్యాదు చేయడం గమనార్హం. 1 నుంచి 5వ తరగతి వరకు హిందూ క్షత్రియ అని అనంతరం 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వాల్మీకి క్షత్రియ అనే పేర్లతో కుల ధ్రువీకరణ ఉందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వుడ్ నియోజక వర్గమైన రాయచూరు నుంచి గతంలో తప్పుడు ధ్రువపత్రాల ఆధారంగానే ఆయన ఎన్నికైయ్యారంటు ఆరోపించారు. ఈ క్రమంలో ఆయన ధ్రువీకరణను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాంగ్ చేశారు. దీంతో పాటు రాజా అమరేశ్వర్ నాయక్ సోదరుడైన రాజా రాయప్ప నాయక్ గతంలో తమ కులాన్ని ఎస్టీ ఉప జాతి నుంచి తొలగించాలంటు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించిన విషయం ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజా అమరేశ్వర్ నాయక్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు లేవ్వరు ఎస్టీ కులానికి చెందిన వారు కారని, ఆయన ఇచ్చింది తప్పుడు ధ్రువీకరణ అంటు దాన్ని రందు చేయాలని ఫిర్యాదులో కోరారు. కాగా రాజా అమరేశ్వర్ నాయక్‌కు కుల వివాదానికి ఫిర్యాదు అందడంతో ఈ సమస్య బీజేపీ కార్యాలయానికి చేరింది. ఇప్పటి వరకు ఆయనను అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం కులవివాదం నేపథ్యంలో ఎన్నికల కమీషన్ తీసుకునే నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

హోసూరు జోన్

ఒడిశావాసి హత్య

హోసూరు, ఏప్రిల్ 4: తమిళనాడు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ తాలూకా హెబ్బగూడి ప్రాంతంలోని మారియమ్మ ఆలయం సమీపంలో అర్ధరాత్రి పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన దీప్రిరంజన్(30) పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా దుండగులు అతన్ని అడ్డగించి హత్య చేశారు. సమాచారం అందుకున్న హెబ్బగోడి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని సీసీటీవీ ఫుట్టేజీలను పరిశీలిస్తున్నారు. ఇతడికి శత్రువులు ఎవరైనా ఉన్నారా... లేదా మరేదైనా కారణాలతో హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

నగలు, నగదు దోపిడీ

హోసూరు, ఏప్రిల్ 4: తమిళనాడు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం ఆనేకల్ తాలూకా సర్జాపుర ప్రాంతంలో ఇంటి యజమాని నిద్రిస్తుండగా ఇంటి వాచ్‌మ్యాన్ తన సహచరులతో కలిసి చేతులు, కాళ్లు కట్టేసి ఇంట్లో ఉన్న రూ.30 లక్షల నగదు, 250 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రోషన్(35) గత మూడు నెలలుగా సర్జాపురం ప్రాంతానికి చెందిన మధుసూదన్ (60)ఇంటికి వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు రోషన్ ఒకరిని పిలిపించాడు. ఇంట్లో మధుసూదన్ ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న రోషన్ అతని స్నేహితులతో కలిసి ఇంటి యజమాని మధుసూదన్ చేతులు, కాళ్లు కట్టేసి ఇంట్లోని అభరణాలు దోచుకెళ్లారు. బాధితుడు మధుసూధన్ ఫిర్యాదు మేరకు సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం

హోసూరు(సిఫ్‌కాట్) ఏప్రిల్ 4: హోసూరు సమీపంలోని సానమావు అడవుల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తూ పంట పొలాలను నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులు సూచించారు. 20 రోజుల క్రితం హోసూరు సమీపంలోని సానమావు అడవుల్లో 7 ఏనుగులు మకాం చేశాయి. ఈ ఏనుగులు తరచూ పొలాలవైపు వస్తు పంటలను నాశనం చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఒక ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి వీరంగం చేసింది. కామన్‌దొడ్డి ప్రాంతంల్లో వరి, కోసు తదితర పంటలను తిని తొక్కి నాశనం చేసింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏనుగులు పొలాలవైపు రాకుండా కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఏనుగుల సంచారం నేపథ్యంలో గ్రామస్థులెవ్వరూ కాపలాకోసం పొలాలవైపు వెళ్లరాదని, ఆవులు, మేకలు మేపేందుకు అడవులవైపు వెళ్లరాదని అధికారులు సూచిస్తున్నారు.



దెబ్బతిన్న పంట

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కలెక్టర్ సరయూ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కృష్ణగిరి లోక్‌సభ పరిధిలో 6 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ సరయు సూచించారు. ఉత్తంగారై, బర్గూరు, కృష్ణగిరి, వేపనపల్లి, హోసూరు, తళి నియోజకవర్గాలలో మొత్తం 1,888 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ బూత్‌లలో విద్యుత్, తాగునీరు, భద్రతా సౌకర్యాలు, మరుగుదొడ్ల సౌకర్యం, దివ్యాంగులకు ర్యాంప్ ఇతరత్రా సదుపాయాలు కల్పించేలా ప్రిసైడింగ్ ఆఫీసర్లు చొరవ చూపాలని సూచించారు. గురువారం స్థానికంగా కొన్ని పోలింగ్ బూత్‌ల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సరయూ



సబ్ కలెక్టర్ కార్యాలయంలో నగదు అప్పగిస్తున్న అధికారులు

తనిఖీల్లో రూ.5 లక్షల నగదు స్వాధీనం

హోసూరు ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల వేళ వేర్వేరు ప్రాంతాల చెక్‌పోస్టులలో గురువారం నిర్వహించిన తనిఖీలలో రూ.5.08 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మత్తిగిరి ప్రాంతంలో వ్యాన్‌లో దర్శన్ నుంచి రూ.1.45 లక్షలు, తర్వాత అలసనత్తం ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై విజయ్ నుంచి రూ.2 లక్షలు, నల్లూరు ప్రాంతంలో నాగరాజ్ (50) నుంచి కారులో రూ.1 లక్ష 63 వేలు తరలిస్తుండగా సరైన రికార్డులు లేకపోవడంతో ఎన్నికల స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సదరు మొత్తాన్ని సబ్‌కలెక్టర్ ప్రియాంకకు కార్యాలయంలో అప్పగించారు. నగదు తరలిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

‘ఇండియా’ కూటమి కార్యాలయం ప్రారంభం

హోసూరు, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా ప్రధాన పార్టీలు తమ ఎన్నికల కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయి. డెంకణీకోటలో ‘ఇండియా’ కూటమి ఎన్నికల కార్యాలయాన్ని ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే వై ప్రకాశ్ ప్రారంభించారు. కార్యక్రమానికి బర్గూరు కార్యదర్శి బర్గూరు కార్యదర్శి శ్రీనివాసులు, తళి యూనియన్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్నికల్లో గెలుపుకోసం చేపట్టాల్సిన వ్యూహాలపై చర్చలు చేశారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ సూచన మేరకు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని ఎన్నికల హామీల గురించి వివరించి వారి మద్దతు పొందాలని సూచించారు. పలు అంశాలను చర్చించారు. కొత్త విద్యా విధానాన్ని రద్దు చేస్తాం, భారతదేశం అంతటా అల్పాహార పథకం విస్తరణ, పౌరసత్వ సవరణ చట్టం -2019 రద్దు చేయబడుతుందన్నారు. జాతీయస్థాయిల్లో కులాల వారీగా జనాభా గణన నిర్వహించబడుతుందని, జీఎస్టీ చట్టాన్ని సవరిస్తామని, రాష్ట్రాలకు ఎక్కువ స్వయంప్రతిపత్తి కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరణలు చేస్తామని తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళం మాట్లాడే శ్రీలంక తమిళులకు భారతీయ పౌరసత్వం ఇవ్వబడుతుందని, ఇది తిరుక్కురళ్ నేషనల్ రికార్డుగా ప్రకటించబడుతుందన్నారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు కూరగాయలకు దేశవ్యాప్తంగా టోల్ లేకుండా చేస్తామన్నారు. నీట్ పరీక్ష రద్దు, మహిళా స్వయం సహాయక సంఘానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణం, విద్యార్థులకు వడ్డీ లేని రూ.4 లక్షలు రుణం ఇస్తామన్నారు. కార్యక్రమంలో సిసిఎం జిల్లా కమిటీ సభ్యులు శేఖర్, డెంకణీకోట కౌన్సిల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ముజామిల్ పాషా, కృష్ణన్, సుమతి, వెంకటస్వామి, గోపాల్, మోహన్, రామన్, లింగోజీరావు, చెన్నీర, ఎల్లప్పన్, తదితరులు పాల్గొన్నారు.



ఇండియా కూటమి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బాబు జగ్జీవన్‌రామ్ (జయంతి)



దేశ నాల్గవ ఉపప్రధానిగా వ్యవహరించి 'బాబూజీ'గా పేరొందిన బాబు జగ్జీవన్ రామ్ 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం భోజ్‌పూర్ జిల్లా చంద్వా గ్రామంలో జన్మించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్‌లో అతి పిన్న వయస్కుడైన మంత్రులలో ఒకరు. కేంద్ర కార్మికశాఖ మంత్రిగా వ్యవహరించారు. రాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాటైన కమిషన్‌లోనూ సభ్యులు. ఇండో-పాకిస్థాన్ యుద్ధ సమయంలో డిఫెన్స్ మంత్రిగా వ్యవహరించారు. వ్యవసాయశాఖ మంత్రిగా హరిత విప్లవం సృష్టించారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమా నికి ఎంతో కృషి చేశారు. మూడు దశాబ్దాలకుపైగా నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరించి రికార్డు నెలకొల్పారు. ఆయన సేవలకు గాను కేంద్ర సాంఘిక సంక్షేమశాఖ ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసింది. 1986 జూలై 6న కన్నుమూశారు.

గ్రెగరీ పెక్ (జయంతి)



ఎల్డ్రెడ్ గ్రెగరీ పెక్ 1916 ఏప్రిల్ 5న కాలిఫోర్నియాలో జన్మించారు. అమెరికన్ ప్రముఖ నటులలో ఒకరు. 1940 - 60 దశకాల మధ్య పలు సినిమాలు విజయవంతమయ్యాయి. ఉత్తమ నటుడిగా అకాడమీ అవార్డును గెలుపొందారు. క్లాజిక్ హాలీవుడ్‌లో 25మంది ప్రముఖులలో అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆయనకు 12వ ర్యాంకును ప్రకటించింది. సమాజసేవలోనూ రాణించి ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడంను అందుకున్నారు. రాజకీయాల్లోనూ సత్తా చాటుకున్నారు. 2003 జూన్ 12న కన్నుమూశారు.

వెంకి రామకృష్ణన్ (పుట్టినరోజు)



వెంకట్రామన్‌గా చిరపరిచితులైన వెంకి రామకృష్ణన్ 1952 ఏప్రిల్ 5న తమిళనాడు రాష్ట్రం కుడలోర్‌లో జన్మించారు. బ్రిటిష్ అమెరికన్ స్ట్రక్చరల్ బయోలజిస్ట్‌గా పేరొందారు. తండ్రి ఉద్యోగరీత్యా గుజరాత్‌కు వెళ్లడంతో బాల్యం, విద్యాభ్యాసం బరోడాలో సాగింది. అనంతరం అమెరికాలో స్థిరపడ్డారు. 2009లో కెమిస్ట్రీలో థామస్ ఏ స్టీజ్, అడా యోనాథ్‌లతో కలసి నోబెల్ పురస్కారం అందుకున్నారు. 2010లో పద్మ విభూషణ్ అందుకున్నారు. మెడికల్ రీసెర్చ్ కౌన్సిల్ (ఎంఆర్‌సీ)లో గ్రూప్ లీడర్‌గా వ్యవహరించారు. 2015-20 మధ్య రాయల్ సొసైటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, బ్రిటీష్ లైబ్రరీలో బోర్డు సభ్యుడిగా ఉన్నారు. 2022 లో 'ఆర్డర్ ఆఫ్ మెరిట్' గుర్తింపు పొందారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 4: శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి అటవీ ప్రాంతంలో గురువారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బెళుగుప్ప మండలం భూదివర్తి గ్రామానికి చెందిన బోయ భీమలింగ ట్యాక్సీ నడుపుకుంటూ కళ్యాణదుర్గం పట్టణంలో జీవిస్తున్నాడు. పట్టణానికి చెందిన బోయ గణేష్, మరికొంతమంది కలిసి కర్ణాటకలోని పాతప్పగుడికి వెళ్లి కర్ణాటక మద్యం తెస్తూ మార్గమధ్యలో హత్య చేసినట్లు ఆరోపిస్తున్నారు. టెట్రా ప్యాకెట్లు తీసుకుని వస్తున్న క్రమంలో భీమలింగకు గాయాలు కావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి బోయ గణేష్ మరికొంతమంది తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భీమలింగ భార్య రత్నమ్మ, కుటుంబ సభ్యులు తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళ హత్య చేయించినట్లు ఆరోపించారు. మృతుడి భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు శెట్టూరు పోలీసులు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రత్నమ్మ, కొడుకులు గణేష్, ప్రశాంత్ వున్నారు.

మహిళ ఆత్మహత్య

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4: మండలంలోని వసగుడ్డం గ్రామానికి చెందిన కావేరి(33) అనే మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన మేరకు వసగుడ్డం గ్రామానికి చెందిన గోనప్పకు కర్ణాటక కరుగోడు గ్రామానికి చెందిన కావేరితో రెండేళ్ల క్రితం వివాహం జరిగినది. వీరికి ఐదు నెలల పాప ఉంది. గత కొద్దిరోజులుగా కుటుంబ కలహాలు ఉండడంతో తీవ్ర మనస్థాపం చెందిన కావేరి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు తలుపులు బద్ధలు కొట్టి చూడగా అప్పటికే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గడ్డివాముల దగ్ధం

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4: మండలంలోని కాదలూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో గ్రామానికి చెందిన రైతుల గడ్డివాములు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక ఆవు మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు రైతు హనుమంతరెడ్డి గ్రామ సమీపంలో పశువుల మేతకు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయాయి. గమనించిన గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించింది. ఈ ప్రమాదంలో రైతు కెంచప్పకు చెందిన ఆవు మంటల్లో కాలిపోయింది. రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో రైతు బిక్కిలప్పకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. రైతు బిక్కిలప్ప తెలిపిన వివరాల మేరకు పశువుల మేతకు నాలుగు ట్రాక్టర్ల గడ్డివాము పొలానికి సమీపంలో ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు తెలిపారు. రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెద్దవడుగూరు, ఏప్రిల్ 4: మండలకేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 12మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి మద్యం విక్రేతను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రసాయన ఎరువుల వాడకంతో ఆరోగ్యంపై దుష్ప్రభావం

చింతామణి, ఏప్రిల్ 4: ఇటీవలికాలంలో వివిధ రకాల పంటలకు వినియోగిస్తున్న రసాయన ఎరువుల వాడకం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతోందని రిటైర్డు ఉపాధ్యాయుడు జయరామరెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంజని లే అవుట్ ఫిల్టర్‌బెడ్‌సర్కిల్ వద్ద కాళప్ప లే అవుట్‌లోని నాగనాథేశ్వరి సంగీత, నృత్యాలయలో శ్రీ సర్వోదయ ఆరోగ్యధామ అధ్వర్యంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆక్సిజన్, బ్లడ్ సర్క్యులేషన్ యంత్రం, ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ థెరపీ యంత్రాలు వినియోగించారు. శుద్ధమైన గాలి, నాణ్యమైన ఆహారం లభించినప్పుడు మనిషి వందేళ్లు ఆరోగ్యంగా జీవించడం సాధ్యమవుతుందని, ఇందుకు మన పూర్వీకులే ఉదాహరణ అన్నారు. ఇటీవలికాలంలో జనాభా పెరుగుతోందని అందుకు తగినట్టుగా ఆహారం కోసం రకరకాల హైబ్రీడ్ వంగడాలు ఉత్పత్తి, రసాయన ఎరువులను ఇష్టం వచ్చినట్టు వాడడం ద్వారా దిగుబడుల సంగతి ఎలా ఉన్నా ఆరోగ్యంపై మాత్రం తీవ్రం ప్రభావం చూపుతోందన్నారు. ఈనెల 13వరకు ఉచిత ఆరోగ్య శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించడంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సర్వోదయ ఆరోగ్యధామ సంస్థాపకులు శ్రీధర్ మాట్లాడుతూ సరికొత్త యం త్రాల ద్వారా బీపీ, షుగర్, సంధివాతం, వెరికోస్‌వీన్స్, సయాటికా, వెన్నునొప్పి, పార్కి న్సన్, సర్వైకల్ స్పాండిలైటిస్ వంటి వాటిని నియంత్రించడం సాధ్యమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఈసీజీ శిబిరం కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నాగనాథేశ్వరి సంగీత, నృత్యాలయ సంస్థాపకుడు అశోక్, రచయిత కేఎస్ నూరుల్లా, పంకజమ్మ, తదితరులు ప్రసంగించారు. సర్వోదయ సంస్థ సిబ్బంది అశోక్‌కుమార్, మంజునాథ్, మనోజ్‌కుమార్, బాలాజి, చంద్రశేఖర్, ఆంజనేయరెడ్డి, కార్యక్రమ ఆర్గనైజర్లు రజని, శిల్ప, ప్రేమ, దీక్షా తదితరులు పాల్గొన్నారు.



ఆక్సిజన్, బ్లడ్ సర్క్యులేషన్ యంత్రం ద్వారా పరీక్షలు ఇలా...

క్రికెటర్ శ్రేయాంకపాటిల్‌కు ఘన స్వాగతం

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయానికి కారకురాలిగా వ్యవహరించిన క్రీడాకారిణి శ్రేయాంకపాటిల్‌కు సొంతూరులో భారీగా స్వాగతం లభించింది. కలబురగి జిల్లా జీవర్గి తాలూకా కొళకూరు గ్రామానికి శ్రేయాంకపాటిల్ చేరుకున్నారు. గ్రామ సరిహద్దున ఉండే సిద్దబసవేశ్వర ఆలయం నుంచి వీధుల గుండా ర్యాలీ జరిపి ఊరేగింపు చేశారు. ఇదే సందర్భంగా శ్రేయాంకపాటిల్ మాట్లాడుతూ ఆర్‌సీబీ జట్టు విజేతగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. జట్టులోని క్రీడా కారులంతా సమిష్టిగా ఆడామన్నారు. జట్టు సభ్యులు ప్రత్యేకంగా నన్ను అభిమానించేవారన్నారు. ప్రతిచోటా స్టేడియంలోను నాపట్ల అభిమానులు చూపిన ఆదరాభిమానాలు గుర్తుండిపోతాయన్నారు. భవిష్యత్‌లో ఇంటర్నేషనల్ పోటీలలో రాణించాలన్నదే లక్ష్యమన్నారు. ఎన్నోఏళ్ళుగా అభిమానించే క్రికెటర్ విరాట్‌కొహ్లీ జట్టు విజేతగా నిలిచిన వెంటనే శుభాకాంక్షలు తెలపడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్థుల అభిమానం సంతోషంగా ఉందన్నారు. మా గ్రామాన్ని బంధుమిత్రులు ఎప్పుడూ గుర్తుకు వస్తుంటారన్నారు.



శ్రేయాంకపాటిల్‌ను ఊరేగిస్తున్న సొంతూరు ప్రజలు, గ్రామస్థుల ఆత్మీయ సన్మానం (ఇన్‌సెట్‌లో...)

వైద్యంలోనే కాదు సేవారంగంలోనూ రాణించాలి..

- డాక్టర్ మంజునాథ్ భార్య అనసూయ

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జయదేవ ఆసుపత్రి డైరెక్టర్‌గా దశాబ్దాల కాలం పాటు ఉన్నతంగా సేవలు అందించారనే సంతృప్తి ఉందని ప్రస్తుతం లోక్‌సభ సభ్యుడిగా అన్నివర్గాలకు సేవలు చేయదలచి వచ్చారని పార్లమెంటుకు వెళ్ళేలాంటి శక్తి కల్పించాలని బెంగళూరు గ్రామీణ బీజేపీ- జేడీఎస్‌ల ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ మంజునాథ్ భార్య అనసూయ కోరారు. గురువారం నామినేషన్‌ల దాఖలకు ముందుగా మైసూరు చాముండేశ్వరీ దేవి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ సమాజం బాగుండాలంటే అందరూ ఆరోగ్యంగా ఉండాలని భావించిన మంజునాథ్ వైద్యరంగంలో ఏళ్ళతరబడి అలుపెరగకుండా సేవలు చేశారన్నారు. గుండె జబ్బులతో వచ్చినవారికి చికిత్సలే కాకుండా ధైర్యం చెప్పేవారన్నారు. ఇలా రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటక వాసులకే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన వారికి పలు విదేశీ రోగులకు ఆపరేషన్‌లు చేయడం ద్వారా ఎన్నో కుటుంబాల ప్రేమ అభిమానాలు పొందారన్నారు. డాక్టర్ మంజునాథ్ అంటూ అన్నివర్గాల ప్రజలు అభిమానిస్తారనే అంశాలు అప్పుడప్పుడు వింటుంటే సంతోషం కలిగేదన్నారు. ఒక వైద్యుడిగా లక్షలాది మందికి సేవచేసిన ఆయనకు రాజకీయంగా ఒక అవకాశం కల్పించి కొత్తశక్తిని ఇవ్వాలని సూచించారు. బెంగళూరు గ్రామీణ నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.

వయనాడ్, అలప్పిలో జమీర్‌అహ్మద్ ప్రచారం

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న కేరళ రాష్ట్రం వయనాడ్, అలప్పి నియోజకవర్గాలలో ప్రచారం చేయాలనే అధిష్ఠానం ఆదేశాల మేరకు రాష్ట్ర వసతి, వక్ఫ్ శాఖా మంత్రి జమీర్‌అహ్మద్ పర్యటించారు. క్యాలికట్‌లో కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ సమితి మాజీ అధ్యక్షుడు చెన్నిత్తల, కల్పట్ట ఎమ్మెల్యే సిద్దిక్, సుల్తాన్ బతేరి ఎమ్మెల్యే బాలకృష్ణన్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పర్యటనలో ముఫ్తి షేక్ అబూబకర్ అహ్మద్ సహా ముస్లిం ధార్మిక ప్రముఖులు, వయనాడ్ యూడీఎఫ్ అధ్యక్షుడు కేకే అహ్మద్ హాజిలను జమీర్ అహ్మద్‌ఖాన్, అభ్యర్థి కేసీ వేణుగోపాల్‌లు భేటీ అయ్యారు.



కేరళ రాష్ట్ర ప్రముఖులతో మంత్రి జమీర్ అహ్మద్

సమగ్ర విద్యుత్ కోసం రైతుల ధర్నా

బెంగళూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా కృష్ణా నదీతీరం ఆయకట్టు పరిధిలో వ్యవసాయ పంప్‌సెట్లకు సమగ్ర విద్యుత్ అందించాలని, అంతరాయంలేని విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్‌లకు తగిన అనుమతులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. యాదగిరి జిల్లా వడగేరా తాలూకాలోని కదరాపుర విద్యుత్ పంపిణీ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. శివనూరు, తుమకూరు, కదరాపుర, ఇటగి, రోట్నడగి, కోడాల, గుండ్లూరు తదితర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు. ఎటువంటి సమాచారం లేకుండానే విద్యుత్‌కోతలు విధిస్తున్నారంటూ మండిపడ్డారు. 8 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. నిరసనలో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



కదరాపురలో రైతుల నిరసన

జిల్లాలో తాగునీటి సమస్య పై ప్రత్యేక దృష్టి

- నారాయణపుర జలాశయం నుంచి ఒక టీఎంసీ నీరు విడుదల
- జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 4 : వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. తాగునీటి అవసరాల కోసం నారాయణపూర జలాశయం నుంచి కృష్ణ నదికి ఒక్క టీఎంసీ నీటి విడుదలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద తనను కలిసిన విలేఖరులతో డీసీ మాట్లాడారు. తుంగభద్ర జలాశయం పై ఆధారపడిన చెరువులన్నింటిని ఇప్పటికి పూర్తిస్థాయిలో నీటితో నింపామన్నారు. ఇందుకు సంబంధించి 80 శాతం చెరువుల్లో పూర్తిస్థాయి నీరుండగా మరో 20 శాతం చెరువుల్లో సగం వరకు నీటితో నింపామన్నారు. కృష్ణనదికి నీటి విడుదల జరిగితే కృష్ణనది ఆధారంగా తాగునీటి అవసరాలకు ఉపయోగించే చరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపుతామన్నారు. దీంతో పాటు జిల్లాలో వేసవి తాగునీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వార నీటి సరఫరా చేసేందుకు ఇప్పటికే తాలూకా పంచాయతీలకు రూ.50 లక్షల మేరకు నిధులు విడుద చేశామన్నారు. అందుబాటులో ఉన్న ప్రైవేటు బోర్‌ల ద్వార ప్రజలకు తాగునీటిని అందించేందుకు కిందిస్థాయి అధికారులకు తగిన ఆదేశాలిచ్చినట్లు జిల్లాధికారి తెలిపారు. వర్షకాలం ఆరంభమైయ్యే వరకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తు తగిన నిర్ణయం తీసుకునేలా క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లాధికారి వివరించారు.



మీడియాతో జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్

గౌతమ్ నామినేషన్‌లో కార్యకర్తల సందడి

బంగారపేట, ఏప్రిల్ 4: కోలారు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్ నామినేషన్‌లో కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బంగారపేట తాలూకా నుంచి సుమారు 3వేలమంది పాల్గొంటున్నట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. తాలూకా నుంచి 210 టాటా సుమోలతో వెళ్తున్నట్టు తెలిపారు. ఎస్ఎన్ రిసార్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలోని అన్ని గ్రామపంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు, పురసభ మాజీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా బూదికోటె బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజ్, పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు, గ్రామపంచాయతీ అధ్యక్షుడు నారాయణస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పురసభ సభ్యుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

- జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్
- ఓటింగ్ శాతం పెంపు పై ప్రత్యేక ప్రచారం



ఓటు హక్కు జాతాకు పచ్చజెండా

రాయచూరు, ఏప్రిల్ 4: దేశంలోని పౌరులందరికి రాజ్యాంగం సమానంగా అందజేసిన ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ కోరారు. గత శాసనసభ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన నియోజక వర్గాల్లో ప్రత్యేక్ష కార్యాచరణ ద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాన్ని గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద పంచజెండ ఊపి జిల్లాధికారి ప్రారంభించారు. జాగృతి జాతా ద్వార వివిధ తాలూకాలు, గ్రామాల వారిగా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రత్యక్ష ఓటింగ్‌లో పాల్గొనడం ద్వారా ప్రజలకు ఓటు హక్కు పై అవగాహనతో పాటు కొత్త చైతన్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ప్రచారం కోసం సిద్ధం చేసిన ప్రత్యేక వాహనంలో ఈవీఎం, వీవీప్యాట్‌లతో పాటు ఓటు వేసిన తక్షణమే నమోదయ్యే విధంగా బీప్ శబ్ధం రావడం తదితర వాటిపై ఓటర్లకు అవగాహన కల్పించే పరికరాలను ఏర్పాటు చేశారు. 18ఏళ్ల పూర్తి చేసుకున్నవారంతా అర్హులైనవారు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకోవడం మన బాధ్యత అని సూచించారు. జిల్లా ఎన్నికల స్వీప్‌సమితి అధికారులు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిప్రాంతాల్లో ఓటు ఎలా వేయాలి, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా ఎపిక్ నెంబరు నమోదు చేస్తే మీ పోలింగ్ బూత్ వివరాలు తెలుస్తాయన్నారు. ఇందుకు సంబంధించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి



తహసీల్దారు రశ్మికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బంగారపేట, ఏప్రిల్ 4: తాలూకాలోని సక్కనహళ్ళి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ తహసీల్దారు రశ్మికి గ్రామపంచాయతీ సభ్యుడు కుపేంద్ర కోరారు. ఈ మేరకు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామంలోని స్మశాన ప్రాంతాన్ని మహేశ్ రెడ్డి అనే వ్యక్తి పేరిట నకిలీ ఖాతా చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. గ్రామానికి చెందిన దివంగత వెంకటరామిరెడ్డి కొడుకు మహేశ్‌రెడ్డి అమెరికాలో కొంత కాలం ఉన్నాడన్నారు. సర్వే 19లో ఖాతా చేసేందుకు మహేశరెడ్డి పేరిట ఎవరో మార్చి 14న అర్జీ సమర్పించారన్నారు. సర్వే 19 ఎస్సీలకోసం కేటాయించిన స్మశాన ప్రదేశమన్నారు. మిగిలిన సర్వే నెంబర్లు మహేశ రెడ్డి అన్నదమ్ముల స్వాధీనంలో ఉన్నాయన్నారు. ఏదేమైనా ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపాలని తహసీల్దారును కోరినట్టు తెలిపారు.

జోరుగా ఎస్‌యూసీఐ ప్రచారం

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 4: ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ బళ్ళారి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా సమితి సభ్యులు సోమశేఖర్ గౌడ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ పార్టీ కర్ణాటకలో 19 నియోజక వర్గాల్లో తన పార్టీ అభ్యర్థులను రంగంలో దించుతున్నట్లు తెలిపారు. తమ పార్టీని ఆదరించి, అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్‌యూసీఐ కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సభ్యులు సోమశేఖర్ గౌడ, డాక్టర్ ప్రమోద్, ఎ.శాంతా, సభ్యులు నారత్న, జగదీష్, సురేష్, రవికిరణ్, అనుపమ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఆవులు, గేదెలకు టీకాలు

తోరణగల్లు, ఏప్రిల్ 4: ఆవులకు, గేదెలకు వ్యాధులు ప్రబలకుండా రాష్ట్రవ్యాప్తంగా టీకా వేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కురేకుప్ప గ్రామంలో వెటర్నరీ డాక్టర్ కులకర్ణి, గేదెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధులు ప్రబలకుండా టీకా వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు

తోరణగల్లు, ఏప్రిల్ 4: మండుతున్న ఎండలతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. తోరణగల్లు స్టేషన్‌లోని జిందాల్ పరిశ్రమ ఓల్డ్ గేట్ సమీపంలో ఎప్పుడు రోడ్డు, జనాలతో, వాహనాలతో రద్దీగా ప్రాంతం. అయితే ఎండ వేడిమిని తట్టుకోలేక జనం బయటకు రావడం లేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, జాగ్రత్త వహించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి



బళ్ళారెప్ప(ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 4: జిల్లాలోని లింగసుగూరు బస్‌స్టాండ్‌లో గురువారం మధ్యాహ్నం వేళ వయోవృద్ధుడు మృత్యువాతపడ్డాడు. మృతుడు మస్కి తాలూకా ఆనదగల్ గ్రామానికి చెందిన కృష్ణప్ప బళ్ళారెప్ప(62)గా పోలీసులు గుర్తించారు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు చికిత్స కోసం లింగసుగూరు పట్టణానికి రాగా చికిత్స తీసుకున్న అనంతరం తిగిరి గ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టాండ్‌కు వచ్చాడు. అక్కడే మరో సారి అస్వస్థతకు గురై కుప్పకూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఎండతీవ్రత తట్టుకోలేకే మృత్యువాత పడిఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న లింగసుగూరు డీఎస్పీ తన సిబ్బందితో వచ్చి శవ పరిశీలన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా లింగసుగూరుతో పాటు జిల్లాలోని పలు తాలూకాల్లో గడచిన మూడు రోజులుగా ఎండ తీవ్రత పెరిగిందని ఉదయం 11 గంటలు దాటితే బయటికి రాలేకపోతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షభావ పరిస్థితులకు తోడు జిల్లాలోని థర్మల్ విద్యుత్ స్టేషన్ వల్లనే ఎండ తీవ్రత ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మూడు ట్రాక్టర్ల పట్టివేత

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 4: గుమ్మఘట్ట మండలం భూపసముద్రం నుంచి రాయదుర్గానికి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తు న్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. బుధవారం రాయదుర్గం మండలం వేపరాళ్ల ఇసుక రీచ్ నుంచి కర్ణాటకకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని తగు చర్య నిమితం ఏడీ మైన్స్ అండ్ జియాలజీ వారికి సమాచారాన్ని అందించినట్లు తెలిపారు.

జెండాల తొలగింపు

యల్లనూరు, ఏప్రిల్ 4: మండలంలోని మేడికుర్తి గ్రామంలో ఇరుపార్టీల జెండాలను గురువారం తొలగించారు. ఇరుపార్టీలు ప్రచారం ముమ్మరం చేయడంతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో వద్ద వైసీపీ జెండాలను ఏర్పాటు చేయడంతో టీడీపీ వారు కూడా ఏర్పాటుచేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం కాలనీలోకి వెళ్లి ఇరుపార్టీల జెండాలను తొలగించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

యాడికి, ఏప్రిల్ 4: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్నిపార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ సావిత్రి కోరారు. బుధవారం యాడికిలోని సమావేశ భవనంలో అన్నిపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. యాడికి సీఐ నాగార్జునరెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.